
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



లాభాల కట్టుబడి..

గసభ పంచాయతీ మొర్రిగుడలో ఇటుకల బట్టీ గిరిజనులకు ఆర్థిక ఆసరాగా నిలుస్తోంది. సమీప గ్రామాలకు సరఫరా చేస్తున్నారు.

8లో



ప్రేమ సమాజం సేవలు

విశాఖ ప్రేమ సమాజం వారు వెయ్యి మంది పేద గిరిజనులకు రగ్గులు, దుప్పట్లు, వంట నూనె పంపిణీ చేశారు.

8లో

పంచామృతాభిషేకం



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం



మాజీ సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, పెట్ల ఉమాశంకర్ గణేష్, కన్నబాబురాజు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ తదితరులు



ఎయిర్‌పోర్టు వీవీపీ లాంజ్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు

సాక్షి, విశాఖపట్నం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఆయన తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో విశాఖ ఎయిర్‌పోర్టుకు మధ్యాహ్నం 12.42 గంటలకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు వీవీపీ లాంజ్‌లో వైఎస్సార్ సీపీ నాయకులతో భేటీ అయ్యారు. అనంతరం 1.19 గంటలకు హెలికాప్టర్‌లో మన్యం పార్వతీపురం జిల్లా పాలకొండకు బయలుదేరారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని పరామర్శించి తిరిగి విశాఖ ఎయిర్‌పోర్టుకు 4.13 గంటలకు చేరుకున్నారు. ఇక్కడ నుంచి 6.20 గంటలకు విమానంలో బెంగళూరుకు బయలుదేరారు. జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికినవారిలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, కన్నబాబురాజు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, సమన్వయకర్తలు కె.కె.రాజు, తిప్పల దేవన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, ముఖ్యనేతలు జి.వెంకటేశ్వరావు, బొడ్డేడ ప్రసాద్, గొలగాని శ్రీనివాస్, ఈర్లె అనురాధ, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, రెయ్యి వెంకటరమణ, సాడి పద్మారెడ్డి, వంశీరెడ్డి, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు జాన్‌వెస్లీ, పేడాడ రమణకుమారి, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, పీలా వెంకటలక్ష్మి, పైలా శ్రీనివాసరావు, దొడ్డి కిరణ్, జీలకర్ర నాగేంద్ర ఉన్నారు. జగన్‌తో పాటు పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, కృష్ణమోహన్‌రెడ్డి ఉన్నారు.

పేదల ఇళ్లపై కమీషన్ల దందా!



- ఒక్కో ఇంటికి రూ.500 చొప్పున వసూలు
- కాంట్రాక్టర్లకు గృహ నిర్మాణ శాఖ అధికారుల హుకుం
- లేదంటే బిల్లులు నిలిపేస్తామని బెదిరింపులు
- దుకాణం తెరిచిన నామినేటెడ్ పోస్టులోని కూటమి నేత
- కాంట్రాక్టర్లతో నేరుగా డీలింగ్



విశాఖలోనే రూ.5 కోట్లకుపైగా కలెక్షన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

పేదల ఇళ్ల నిర్మాణాలపై కూటమి నేతలే కాదు అధికారులు కూడా గెద్దల్లా వాలిపోతున్నారు. ఒక్కో ఇంటికి రూ.500 చొప్పున ఇస్తేనే బిల్లులు చేస్తామంటూ కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లకు తెగబడుతున్నారు. గృహ నిర్మాణ శాఖకు చెందిన ఓ అధికారి కాంట్రాక్టర్లకు ఆదేశాలు కూడా జారీ చేసేశారు. ఒకవేళ అడిగిన మొత్తం ఇవ్వకపోతే బిల్లులు చేసేది లేదని తెగేసి చెప్పినట్టు సమాచారం. తమకు వారం వారం బిల్లులు నిలిచిపోయే ప్రమాదం ఉండటంతో కాంట్రాక్టర్లు కూడా అందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఒక్క విశాఖ జిల్లాలోనే నిర్మాణంలో ఉన్న ఇళ్లు, ఇంకా ప్రారంభం కావాల్సిన ఇళ్ల నుంచి సదరు అధికారి ఏకంగా రూ.5 కోట్లకుపైగా వసూలు చేసేందుకు సిద్ధపడటం గమనార్హం. మరోవైపు నామినేటెడ్ పోస్టులోని కూటమి నేత ఒకరు కూడా వసూళ్ల దుకాణం తెరిచినట్టు తెలుస్తోంది. నేరుగా కాంట్రాక్టర్లతో డీలింగ్ చేసుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనకు తెలియకుండా ఏ ఒక్కరి బిల్లు కూడా జారీ కాకూడదంటూ హుకుం జారీ చేసినట్టు సమాచారం. ఒకవైపు అధికారులు, మరో వైపు కూటమి నేత వసూళ్లతో పేదల ఇళ్ల నిర్మాణం నాసిరకంగా మారనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మీరు ఎలా ఇళ్లు నిర్మించి ఇచ్చినా.. ఎటువంటి విచారణ లేకుండా బిల్లులు మంజూరు చేస్తామంటూ హామీ లభిస్తుండటంతో కాంట్రాక్టర్లు కూడా అడిగిన మొత్తం ఇచ్చేందుకు సిద్ధమైనట్లు సమాచారం.



అరకులోయ మండలం కొత్తబల్లుగుడలో నిర్మాణంలో ఉన్న ఇల్లు

కమీషన్లు రూ. కోట్లలోనే..

ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా 2 లక్షలకు పైగా ఇళ్లను గత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసింది. విశాఖ నగర పరిధిలో ఇళ్లు మంజూరు చేసినప్పటికీ.. టీడీపీ నేతలు కేసులు వేసి స్థలాలు ఇవ్వకుండా తాత్సారం చేశారు. చివరకు కోర్టులో కేసులు తేలిన తర్వాత జగనన్న కాలనీల్లో 2023 చివర్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఫలితంగా విశాఖ పరిధిలో నిర్మాణం పూర్తయిన ఇళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఇంకా నిర్మాణంలో ఉన్నవి, ప్రారంభించాల్సిన ఇళ్ల సంఖ్య లక్షకు పైగానే ఉంది. ఇదే ఇప్పుడు అధికారులకు కలిసొచ్చింది. వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలన్న కేంద్రం ఆదేశాలతో కాంట్రాక్టర్లు పరుగు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అధికారులు కూడా వసూళ్లకు తెగబడినట్టు తెలుస్తోంది. ఒక్కో ఇంటికి రూ.500 చొప్పున ఇవ్వాలంటూ గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారి ఒకరు టార్గెట్ విధించారు. ఇది చిన్న మొత్తంగా కనిపిస్తున్నప్పటికీ.. మొత్తం లెక్కిస్తే మాత్రం కళ్లు బైర్లు కమ్మాల్సిందే. ఒక్క విశాఖ జిల్లాలోనే నిర్మాణంలో ఉన్నవి, ప్రారంభం కావాల్సిన ఇళ్ల సంఖ్య 1,06,303 ఉన్నాయి. అంటే ఒక్కో ఇంటికి రూ.500 చొప్పున లెక్కిస్తే సదరు అధికారి వసూళ్ల లక్ష్యం రూ.5.31 కోట్లకు పైమాటే. అనకాపల్లి, అల్లూరి జిల్లాలను కూడా కలిపి లెక్కిస్తే గృహ నిర్మాణ శాఖ అధికారుల వసూళ్ల మొత్తం సుమారు రూ.10 కోట్లకు చేరుతుంది. అంతేకాకుండా కింది స్థాయిలోని అధికారులతో పాటు నామినేటెడ్ పోస్టులోని మరో కూటమి నేత కూడా ఇంటికి ఇంత చొప్పున వసూళ్లకు తెగబడినట్టు సమాచారం. మొత్తం కలుపుకుంటే ఈ మొత్తం రూ.15 కోట్లకు చేరుకుంటుందని అంచనా.

ఇళ్ల నాణ్యతపై నీలినీడలు?

కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలపై కినుక వహించింది. గృహ నిర్మాణాల్లో అవకతవకలు జరిగాయంటూ నానా యాగీ చేసింది. దీనిపై విచారణ చేపట్టాలంటూ హడావుడి చేసింది. గృహ నిర్మాణ లబ్ధిదారులందరూ అసలైన అర్హులు కావడంతో కిమ్మనకుండా ఉండిపోయింది. విచారణ పేరుతో పుణ్యకాలం కాస్తా గడిపింది. అయితే గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయకపోతే రాయితీ మొత్తాన్ని ఇవ్వమని కేంద్రం నుంచి గట్టిగా వార్నింగ్ వచ్చింది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలంటూ ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇదే అదనుగా కట్టే ప్రతీ ఇంటికీ తమ వాటాగా రూ.500 ఇవ్వాలంటూ జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి కాంట్రాక్టర్లను డిమాండ్ చేస్తున్నారు. దీనికి తోడు నామినేటెడ్ పోస్టులోని కూటమి నేతతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా తమ వంతు వాటా ఇవ్వాలంటూ ఒత్తిళ్లు తెస్తున్నారు. వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలన్న ఆదేశాలు ఒకవైపు.. వసూళ్ల డిమాండ్ మరోవైపు ఉండటంతో పేదల ఇళ్ల నిర్మాణాల నాణ్యతపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి.

పేదల ఇళ్ల నిర్మాణాలు

విశాఖ జిల్లాలో...	
మంజూరైన ఇళ్లు	1,14,795
పూర్తయిన ఇళ్లు	8,492
నిర్మాణ పనులు మొదలైన ఇళ్లు	91,219
ప్రారంభం కావల్సినవి	15,084
అనకాపల్లి జిల్లాలో..	
మంజూరైన ఇళ్లు	65,800
పూర్తయిన ఇళ్లు	28,910
వివిధ దశల్లో నిర్మాణంలోని ఇళ్లు	19,278
ప్రారంభం కావల్సినవి	17,627
అల్లూరి జిల్లాలో..	
మంజూరైన ఇళ్లు	56,852
పూర్తయిన ఇళ్లు	3,350
వివిధ దశల్లో నిర్మాణంలోనివి	49,798
ప్రారంభం కావాల్సినవి	3,527

ఏజెన్సీ డీఈవో పాఠశాలల తనిఖీ

గంగవరం: మండలంలోని ఓజుబంద, జగ్గంపాలెం, జియ్యంపాలెం మండల పరిషత్ పాఠశాలలను ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. లెసన్ ప్లాన్, డైరీలు, రికార్డులు పరిశీలించారు. అలాగే విద్యార్థుల వర్క్‌బుక్‌లు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఇంగ్లిష్, గణితం సబ్జెక్ట్‌లలో సామర్థ్యాలను పెంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకమైన తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం ఆహారం ఇవ్వాలని చెప్పారు.



ఓజుబందలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో మల్లేశ్వరరావు

న్యూస్‌రీల్

'కొత్తపల్లి' అందాలకు ఫిదా

జలపాతాన్ని సందర్శించిన పీఎం జన్‌మన్ కేంద్ర కమిటీ



కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించిన పీఎం జన్‌మన్ కేంద్ర కమిటీ బృందం

జి.మాడుగుల: పీఎం జన్‌మన్ కేంద్ర కమిటీ బృందం గురువారం కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించింది. చింతపల్లి మండలంలో పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాల పరిశీలన నిమిత్తం వెళుతూ మధ్యలో గృహనిర్మాణ శాఖ అధికారులతో కలిసి కేంద్ర గ్రామీణాభివృద్ధి గృహ నిర్మాణ విభాగం పీఎంయా ఆర్‌హెచ్ సభ్యురాలు నిషి కాండెల్‌వల్ తదితరలు జలపాతాన్ని తిలకించారు. అక్కడి ప్రకృతి అందాలకు ముగ్ధులయ్యారు. ఇక్కడ పెద్దపెద్ద బండరాళ్లపై నుంచి జాలువారుతున్న నీటి ప్రవాహాన్ని కెమెరాలో బంధించారు. హౌసింగ్ పీడీ బాబూనాయక్, జి.మాడుగుల హౌసింగ్ ఏఈ డి.ఈశ్వరరావు తదితరులు వారి వెంట ఉన్నారు.

17 మందికి డ్రైవింగ్ శిక్షణ



యువకుడికి ఎల్ఎల్ఆర్ అందిస్తున్న సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ధర్మప్రకాశ్

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా 17 మంది యువతకు శిక్షణ ఇచ్చి డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చినట్లు సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ ధర్మప్రకాశ్ తెలిపారు. గురువారం వై.రామవరంలో జరిగిన కార్యక్రమంలో 17 మంది యువకులకు ఎల్ఎల్ఆర్ లైసెన్స్ అందించామన్నారు. వీరందరికీ పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్‌ని అందిస్తామన్నారు. సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా ఏజెన్సీలోని గిరిజన యువతకు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నట్లు కమాండెంట్ ధర్మప్రకాశ్ తెలిపారు. ఎస్ఐ రామకృష్ణ, సిహెచ్‌సి వైద్యులు చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ నియామకం



సాక్షి, పాడేరు: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గంలో మరింత మంది నేతలకు పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్థానం కల్పించారు. పార్టీ అధినేత ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ప్రకటించింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా కందుల బ్రహ్మాజీరావు (రంపచోడవరం), గాడి సత్యనారాయణ (పాడేరు), గంపరాయి దిలీప్‌కుమార్ (అరకులోయ), ప్రధాన కార్యదర్శులుగా పాడేరు నియోజకవర్గానికి చెందిన వంజరి సీతారామ్‌నాయుడు, సీదరి మంగ్లన్నదొర, అరకులోయ నియోజకవర్గానికి చెందిన వంతాల కొండలరావు, గండేరు చినసత్యం (హుకుంపేట), నక్కా వీర్రాజు (రంపచోడవరం), కోశాధికారిగా కుందేరి రామకృష్ణ (పాడేరు) నియమితులయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పాడేరు నియోజకవర్గానికి చెందిన పాట్టిక పోతురాజు, సిర్మ పండన్న, అరకులోయ నియోజకవర్గానికి చెందిన పూజారి రామారావు, ఒంటిబోయిన సుబ్బారావు, రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన బొడ్డు వెంకటరామన్న, అరవ దివాకర్, ఏక్టివిటీ కార్యదర్శులుగా పాడేరు నియోజకవర్గానికి చెందిన సుమర్ల సూరిబాబు, గెమ్మెలి జోగిరాజు, అరకులోయ నియోజకవర్గానికి చెందిన సాంబి కొండలరావు, కిల్లో రాంచందర్, రంపచోడవరానికి చెందిన మాదిరెడ్డి కృష్ణమోహన్, గురుకు ధర్మరాజు, అధికార ప్రతినిధులుగా కూడా సురేష్‌కుమార్ (పాడేరు), చిక్కాల బాలకృష్ణ (రంపచోడవరం), గుబాయి శ్రీరాములు (అరకులోయ)లను నియమించారు.

చక్కని ప్రణాళికతో ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ

- బాగా చదువుకొని లక్ష్యాలను సాధించాలి
- విద్యార్థులకు జేసీ అభిషేక్ గౌడ మార్గనిర్దేశం



హాజరైన విద్యార్థులు

పాడేరు: గిరిజన విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ అన్నారు. విద్యార్థులు ప్రాథమిక విద్యను పటిష్టంగా నేర్చుకొని లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. నన్నికల్లి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విహార యాత్రకు వెళ్తున్న 120 మంది విద్యార్థినులతో గురువారం ఐటీడీఏ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఉండాలన్నారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాలు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, నన్నికల్లి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి లోతేటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆవు కడుపులో 50 కిలోల పాలిథిన్

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలసలో ఓ ఆవు పొట్ట నుంచి గురువారం 50 కిలోల పాలిథిన్‌ను పశువైద్యుడు బయటకు తీశారు. పాడి రైతు కోరాడ నాయుడుబాబుకు చెందిన ఈ ఆవు ఐదు రోజులుగా కడుపులో నొప్పితో బాధ పడుతూ మేత తినలేకపోతోంది. ఇది గమనించిన రైతు ఆనందపురం పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌ను సంప్రదించారు. ఆవును పరీక్షించి, రుమేనటమీ శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. గురువారం డాక్టర్, అతని బృందం శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి ఆవు కడుపు నుంచి దాదాపు 50 కిలోల పాలిథిన్ కవర్లు, తాళ్లను వెలికితీశారు.

డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ లక్ష్మి బాధ్యతల స్వీకారం



డాక్టర్ లక్ష్మి

సాక్షి, పాడేరు: వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్తగా డాక్టర్ కె.లక్ష్మి గురువారం పాడేరులో బాధ్యతలు స్వీకరించారు. రంపచోడవరం ప్రాంతీయ ఆస్పత్రిలో గైనికాలజిస్టుగా పనిచేస్తున్న ఆమెను డీసీహెచ్‌ఎస్‌గా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేసి చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తానన్నారు.

సేంద్రియ వ్యవసాయానికి పెద్ద పీట

- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ జిల్లాను ఆదర్శంగా తీసుకోవాలి
- ఐటీడీఏ అధికారుల సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: సేంద్రియ వ్యవసాయాభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం జిల్లాలోని అన్ని ఐటీడీఏల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ కార్యాచరణలు తయారు చేయాలని, రానున్న నాలుగేళ్లలో సేంద్రియ వ్యవసాయ జిల్లాగా అభివృద్ధి చేయాలన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ జిల్లాలో సేంద్రియ వ్యవసాయాన్ని అమలు జేస్తున్నారని, ఆ జిల్లాను గిరిజన రైతులంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాడేరు ఇన్‌చార్జి పీవో డాక్టర్ అభిషేక్ గౌడ, రంపచోడవరం పీవో కట్టా సింహాచలం, దంతేవాడ కలెక్టర్ ఆకాష్ఛద్వే, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు నందు, రమేష్‌కుమార్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిండు గర్భిణికి తప్పని డోలీ తిప్పలు

జాజులబంద నుంచి అర్ల వరకు అష్టకష్టాలు

కొయ్యూరు: కూటమి ప్రభుత్వం హామీలు నీటి మీద రాతలుగా మారాయి. ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలలోపే డోలీ మోతలను నివారిస్తామని చేసిన హామీ నేటికీ నెరవేర లేదు. తాజాగా గురువారం మూలపేట పంచాయతీ జాజులబందకు చెందిన ఆదివాసీ మహిళ కొర్రా శాంతికి పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. రహదారి అర్ధంతరంగా ఆగిపోవడంతో జాజులబంద నుంచి నుంచి రోలుగుంట మండలం అర్ల వరకు నాలుగు కిలోమీటర్ల దూరం డోలిపై తరలించారు. అక్కడ నుంచి డౌనూరు ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం శాంతిని మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. 2023లో రూ.కోటి 28 లక్షలతో ఉపాధి రోడ్డును మంజూరు చేశారు. కల్వర్టులు నిర్మించాక పనులు ఆపారు. రోడ్డు నేటికీ అసంపూర్తిగా ఉండడంతో వాహనాలు రావడం లేదు. 160 మంది జనాభా ఉన్న గ్రామానికి ఎలాంటి అత్యవసరమైనా డోలీ మోతలు తప్పడం లేదు. తక్షణమే రోడ్డును పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



శాంతిని డోలీపై తరలిస్తున్న బంధువులు

విశాఖలో హైకోర్టు బెంచ్ కోరుతూ 23న సదస్సు

విశాఖ లీగల్: విశాఖపట్నంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 23వ తేదీన జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ నూతన కార్యాలయంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ జిల్లాలకు చెందిన న్యాయవాదులతో సదస్సు నిర్వహించనున్నట్లు విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ తెలిపారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు డిమాండ్ 1993 నుంచి ఉందని, ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 43 శాతం ఈ ప్రాంతానికి చెందినవేనని పేర్కొన్నారు. విశాఖలో హైకోర్టు బెంచ్‌తోపాటు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం జస్టిస్ ఎట్ డోర్ స్టెప్స్ నినాదంతో జరిగే ఈ సదస్సులో కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పక్కా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట (విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఏఆర్వోలను ఆదేశించారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఎన్నిక నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని శాఖల సమన్వయంతో వ్యవహరించి ఎన్నికను ప్రశాంతంగా జరిగేలా చూడాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితా రూపకల్పన, బ్యాలెట్ పేపరు తయారీ, గుర్తుల కేటాయింపు తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సాంకేతికపరమైన విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ అందజేత, స్వీకరణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ ముందు రోజే సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలపాలని, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏఆర్వోలు, పోలీసు అధికారులు అక్కడి పరిస్థితులను రిటర్నింగ్ అధికారికి వివరించారు. విశాఖ జిల్లా ఏఆర్వో బి.హెచ్.భవానీ శంకర్, అల్లూరి జిల్లా ఏఆర్వో పద్మలత, అనకాపల్లి జిల్లా ఏఆర్వో పీవీఎస్ఎస్ఎన్ సత్యనారాయణ, విజయనగరం జిల్లా ఏఆర్వో శ్రీనివాసమూర్తి, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల ఏఆర్వోలు పాల్గొన్నారు.


లాభాల కట్టుబడి..

ఆర్థిక ఆసరాగా ఇటుకల తయారీ

- గసభ పంచాయతీ మొర్రిగుడలో బట్టీ ఏర్పాటు
- సమీప గ్రామాలకు సరఫరా
- గిరిజనులకు చేయూతగా నిలుస్తున్న వ్యాపారం



ఎండలో ఆరబెట్టిన ఇటుకలు



కుటుంబాలతో కలిసి ఇటుకల బట్టి వద్ద భోజనాలు చేస్తున్న గిరిజనులు

డుంబ్రిగుడ: ఇటుకల తయారీతో ఆర్థికంగా లాభాలు పొందుతున్నామని గిరిజనులు చెబుతున్నారు. మండలంలోని గసభ పంచాయతీ మొర్రిగుడ గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు గత కొన్ని నెలలుగా ఇటుకలు తయారు చేస్తు జీవనోపాధి పొందుతున్నారు. గ్రామంలోని ఓ బట్టీ ఏర్పాటుచేసి తయారు చేసిన ఇటుకలను సమీపంలో గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలోని ఉన్న మట్టి ఇటుకల తయారీకి ఎంతో అనువుగా ఉందని దీంతో తయారుచేస్తున్నట్టు కార్మికులు చెబుతున్నారు. ప్రస్తుతం మైదాన ప్రాంతం నుంచి వచ్చే ఇటుకలు ఒక్కోటి తొమ్మిది రూపాయలు కాగా.. ఇక్కడ తయారుచేసిన ఇటుకలను తమ ప్రాంత గిరిజనులకు అయిదు రూపాయలకు విక్రయిస్తున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ఇటుకల బట్టీకు సమీపంలో గెడ్డ ఉండడంతో నీరు అందుబాటులో ఉందని దీంతో మరింత సులువుగా ఉందని తెలిపారు. పలు గిరిజన కుటుంబాలు ఈ కుటీర పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తునాయన్నారు. కుటుంబసభ్యులందరూ కలిసి పనిచేస్తున్నారని, పది రోజుల్లో 20వేల ఇటుకలు తయారు చేస్తున్నట్టు చెప్పారు. బట్టీలో తయారుచేసిన ఇటుకలను సమీపంలోని సుమారు అయిదు నుంచి ఆరు గ్రామాలకు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం వ్యాపారం సజావుగా సాగుతుందని, మార్కెట్ బాగుందని చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు ప్రోత్సాహం అందించాలని కోరుతున్నారు.



ఇటుకలు కాల్చడానికి కర్రలు పెట్టిన దృశ్యం

ఉపాధి దొరికింది



ఇటుకలు తయారీతో మా కుటుంబాలకు పని దొరుకుతుంది. కుటుంబాలు కలిసి పనులు చేసుకుంటున్నాం. ఆర్థిక ఆసరాగా నిలుస్తోంది. ప్రస్తుతం ఇక్కడే వంటవార్పు చేసుకుంటున్నాం. కుటుంబసభ్యులందరం కలిసి ఇటుకలు తయారీ చేస్తున్నాం.

–పాంగి సోమ్, మొర్రిగుడ, గసభ పంచాయతీ

వ్యాపారం బాగుంది



గతంలో ఇటుకల తయారికీ ఒడిశా నుంచి కార్మికులు వచ్చేవారు. ప్రస్తుతం మేము ఇటుకలు తయారు చేస్తున్నాం. గ్రామంలో బట్టీ ఏర్పాటుచేసుకొని గతేడాది నుంచి ఇటుకల తయారీ చేస్తున్నాం. ప్రస్తుతం వ్యాపారం బాగుంది.

–వంతల అర్జున్, మొర్రిగుడ , గసభ పంచాయతీ

క్షుప్తంగా

పీసా చట్టంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్డీ డీడీ రామనాథం

చింతపల్లి: పీసా చట్టంపై గిరిజనులు అవగాహన పెంచుకోవాలని ఏపీఎస్ఐఆర్డీ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం అన్నారు. పీసా కమిటీ సభ్యులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన గురువారం చింతపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీసా చట్టం, దాని అమలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, వెలుగు ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎన్ఎస్ఎస్ పీవో



పాడేరు: ఈనెల 21 నుంచి 27 వరకు భువనేశ్వర్ ఎస్ఓఏ యూనివర్సిటీలో జరిగే జాతీయ సమైక్యత శిబిరానికి పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ జి. గౌరీశంకర్ ఎంపికయ్యారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో పాల్గొనేందుకు ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలోని వివిధ జిల్లాల నుంచి ఎనిమిది మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేశామని ఆంధ్ర యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

చర్లపల్లి-దానాపూర్ స్పెషల్ రద్దు

తాటిచెట్లపాలెం: చర్లపల్లి–దానాపూర్–చర్లపల్లి(07791/07792) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20 తేదీ నుంచి 28వ తేదీ వరకు ఇరువైపులా రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు

క్రీడలతో మానసికోల్లాసం

ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, విద్యార్థులు ప్రాథమిక విద్య దశ నుంచే ఆటలపై మక్కువ పెంచుకోవాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచించారు. పట్టణంలోని తలారిసింగి గౌతమి పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌కు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. క్రీడ జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మాణిక్యం, పాఠశాల ప్రిన్సిపాల్ శివ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ సీనియర్ నాయకులు కూడా సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి స్కేటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లిలో చిరుజల్లులు



చింతపల్లిలో కురుస్తున్న వర్షం

చింతపల్లి: మండల కేంద్రంలో గురువారం చిరుజల్లులు కురవడంతో ఉపశమనం కలిగింది. ఈ ప్రాంతంలో ప్రస్తుతం తెల్లవారుజామున చలి మంచుతో ఇబ్బందులు పడుతుండగా 9 గంటలు దాటాక ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా చిరుజల్లులు కురవడంతో వాతావరణం చల్లబడింది. ఈ జల్లులు గంటకు పైగా కురిశాయి.

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి సమ్మె నోటీసు

మార్చి 7 తర్వాత సమ్మె

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై మార్చి 7 తర్వాత సమ్మె చేయనున్నట్లు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో కార్మిక సంఘాలు గురువారం సెంట్రల్ స్టోర్స్ కూడలి నుంచి ఉక్కు అడ్మిన్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించాయి. అక్కడ జరిగిన సమావేశంలో సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను దొడ్డిదారిన తొలగించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే సుమారు 300 మందిని తొలగించినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఎస్ఎంఎ, ఏఎస్ఎంఏను తొలగించాలని చూస్తున్నారన్నారు. పాత పద్ధతిలో గేటు పాసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టుల్లో నిర్వాసిత ఖాళీలను నిర్వాసితులతోనే భర్తీ చేయాలన్నారు. అనంతరం ప్లాంట్ యాజమాన్య ప్రతినిధులకు సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, మంత్రి రవి, వంశీ, కోన అప్పారావు, ఉమ్మిడి అప్పారావు, వి.వి.రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌కు ర్యాలీగా వెళ్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

స్టీల్‌ప్లాంట్‌లో వీఆర్ఎస్‌పై వీడని ఉత్కంఠ

విడుదల కాని ఉన్నతాధికారుల జాబితా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్(వీఆర్ఎస్) జాబితాపై ఉత్కంఠ కొనసాగుతోంది. కార్మికులు, కనిష్ఠ స్థాయి అధికారుల జాబితా విడుదలైనప్పటికీ ఈ5, ఆ పైస్థాయి అధికారుల జాబితాపై సస్పెన్స్ అలానే ఉంది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం జారీ చేసిన వీఆర్ఎస్ స్కీమ్‌లో బుధవారం నుంచి అమలు చర్యలు ప్రారంభించారు. మొదటి విడతగా నాన్ వర్క్స్‌కు చెందిన కార్మికులు, ఈ4 స్థాయి వరకు అధికారుల జాబితా విడుదల చేశారు. గురువారం వర్క్స్‌కు చెందిన కార్మికులు, ఈ4 స్థాయి వరకు అధికారులతో కూడిన 826 మంది జాబితా వెల్లడించారు. వారికి ఈపీఎస్ఎస్ పోర్టల్‌లో వీఆర్ఎస్ ఆమోదం పొందినట్లు పేర్కొన్నారు. ఆయా హెచ్ఆర్ జోనల్ కార్యాలయాల్లో అధికారిక పత్రాలు అందించారు. అయితే ఈ5, ఆ పైస్థాయి అధికారులకు చెందిన నాన్ వర్క్స్, వర్క్స్ జాబితాలు ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఉన్నత యాజమాన్యం పరిధిలో ఉండే ఆ జాబితాకు ఆమోదం లభించక పోవడం వల్లే పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా వీఆర్ఎస్ స్కీమ్ నిబంధనలకు విరుద్ధంగా అమోదం పొందిన కొంత మందిని ఉన్నత యాజమాన్యం గుర్తించి, వారిని పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. ఇప్పటికే తిరస్కరణకు గురైన వారికి ఈ నెల 22 వరకు అప్పీలు చేసుకునే అవకాశం ఇచ్చారు.

గిరిజన ప్రాంతాల్లో ప్రేమ సమాజం సేవలు

అల్లిపురం: ప్రేమ సమాజంపేద గిరిజనులకు సహాయం చేసే విషయంలో ముందుంటుందని అధ్యక్షుడు బుద్ద శివాజీ అన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను ఆశ్రమంలో చేరిస్తే వారికి చక్కటి భవిష్యత్తు కల్పిస్తామని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో అరకు వ్యాలీ చుట్టు పక్కల సుమారు వెయ్యి మంది పేద గిరిజనులకు రగ్గులు, దుప్పట్లు, లీటర్ వంట నూనె, కేజీ బంగాళాదుంపలు అందించారు. అక్కడి నవజీవన్ బాయ్స్, గర్ల్స్ హాస్టల్, అన్నపూర్ణ హాస్టల్లోని సుమారు 150 మంది విద్యార్థులకు దుప్పట్లు, రేషన్ సరకులు అందించారు. అరకు మండలం, మాడగడ పంచాయతీ, తాంగుడుగుడ గ్రామంలో పేద గిరిజనులకు రేషన్ సరకులు అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఎటువంటి ఆసరా లేని వృద్ధులను ప్రేమ సమాజంలో చేర్పిస్తే ఆశ్రయం కల్పించి వైద్య సదుపాయం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ సమాజం ఉపాధ్యక్షుడు కేశప్రగడ నరసింహమూర్తి, అడ్వైజర్ డాక్టర్ పి.విశ్వేశ్వరరావు, కోశాధికారి ఎంవీవీకే గుప్త, సంయుక్త కార్యదర్శులు మోహన్ రావు, సురేష్‌కుమార్, గౌరీ ప్రసాద్, మాజీ కార్యదర్శి పి.గణపతిరావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్ల పంపిణీ

పాడేరు రూరల్: మండలంలో కరకపుట్టు, దొడ్డిపల్లి, వంతాడపల్లి, గురుపల్లి, మోదపల్లి, గుర్రగరువు, సంగోడి గ్రామల్లో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో గురువారం 30 మంది కాఫీ రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. అనంతరం జీసీసీ బ్రాంచి మేనేజర్ వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో 100 కేజీలకు పైబడి గిరిజన సహకార సంస్థకు కాఫీ విక్రయించే రైతులను గుర్తించి జీసీసీ టార్పాలిన్లు అందిస్తుందన్నారు. గతంలో కంటే పెంచిన ధరలతోనే ప్రస్తుతం గిరిజన సహకార సంస్థ కాఫీ కొనుగోలు చేస్తుందన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ సేల్స్‌పర్సన్స్ శ్రీదేవి, రామకృష్ణ, శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



కాఫీ రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న మేనేజర్ వెంకటేష్, సిబ్బంది

'సాల్ట్' రద్దుతోనే విద్యా రంగానికి రక్షణ

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్ కుమార్

విశాఖ విద్య: రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగాన్ని సాల్ట్ పథకం విచ్ఛిన్న దశకు తీసుకెళుతోందని, దీన్ని వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్ డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన యూటీఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాల్ట్ పథకం వల్ల ఒకటి, రెండు తరగతుల మారినటువంటి పాఠశాలల సంఖ్య 12 వేలకు పైగా ఉన్నాయని, అక్కడ చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం కష్టంగా ఉందన్నారు. జీవో నంబర్ 117 రద్దు చేసి నూతన జీవో కోసం చేస్తున్న కసరత్తుతో ప్రాథమిక పాఠశాల వ్యవస్థ మూసివేత గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం సాల్ట్ పథకం నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కోశాధికారి ఆర్.మోహన్ రావు మాట్లాడుతూ సాల్ట్ పథకం వల్ల ప్రాథమిక పాఠశాలలు బలహీనపడితే భవిష్యత్‌లో ఉన్నత పాఠశాలలు కూడా బలహీనపడతాయన్నారు. ఈ పథకం వల్ల రోజు వారి గణాంకాలు సేకరించాల్సి ఉందని, దీని వల్ల బోధనకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. ఉపాధ్యాయులకు బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, విశాఖ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్, కోశాధికారి రాంబాబు, సహాధ్యక్షుడు ఎస్.ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న కిశోర్ కుమార్

సాగరతీరంలో శోభాయాత్ర

- వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



దేవతా విగ్రహాల ఊరేగింపు



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు, నగరవాసులు

ఏయూక్యాంపస్: విశాఖ సాగర తీరం హరినామ సంకీర్తనలతో పులకించింది. హరే కృష్ణ హరే కృష్ణ...హరే రామ హరే రామ అంటూ భక్తజనం నృత్యాలు చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో.. విశ్వశాంతిని కాంక్షిస్తూ గురువారం బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్ కూడలి నుంచి గోకుల్ పార్క్ వరకు నిర్వహించిన శోభాయాత్ర నగరంలో ఆధ్యాత్మిక శోభను నింపింది. సుందరంగా పుష్పాలతో అలంకరించిన రథంపై భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులు, రాధా మదన మోహన స్వామి, నితాయి గౌరాంగాల విగ్రహాలను ఊరేగించారు. భక్తులు రథాన్ని తాళ్లతో లాగుతూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అంతర్జాతీయ వ్యవస్థాపకుడు భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులకు మహా కుంభమేళాలో అఖిల భారతీయ అఖాడా పరిషత్ 'విశ్వగురు' బిరుదు ప్రదానం చేసిన సందర్భం, 52 సంవత్సరాల కిందట విశాఖలో జరిపిన పాదయాత్రను గుర్తు చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శోభాయాత్రలో భాగంగా వాయిద్యాలు, కోలాటం, సంకీర్తనలతో భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. సందర్శకులకు దారిపొడవునా ప్రసాదం పంపిణీ చేశారు. హవా మహల్‌లో రాధా మదన్ మోహన్ స్వామి, నితాయి గౌరాంగ, భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల విగ్రహాలకు హారతి ఇచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని దారిపొడవునా భక్తి గీతాలు ఆలపిస్తూ, కోలాటం ఆడారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే వి.రామకృష్ణబాబు, హరేకృష్ణ మూవ్‌మెంట్–అక్షయ పాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు అమితాసన దాస స్వామీజీ, విశాఖ అధ్యక్షుడు నిష్కించిన భక్త దాస తదితరులు పాల్గొన్నారు.

'జ్ఞానజ్యోతి' వెలుగులు

- మారనున్న అంగన్‌వాడీ చదువులు
- కార్యకర్తలకు ముగిసిన మొదటి విడత శిక్షణ

విశాఖ విద్య: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్త రూపు సంతరించుకోబోతున్నాయి. జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా అంగన్ వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. 3 నుంచి 5 సంవత్సరాల మధ్య వయసు గల చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువులు అందించేలా 'జ్ఞాన జ్యోతి'పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్న లక్ష్యంతో 'పోషణ్ భీ-పడాయి భీ'పథకం అమలుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకనుగుణంగానే కేంద్రాల్లో సరికొత్త చదువులకు విద్యాశాఖాధికారులు పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే పటిష్టమైన పునాదులు

పిల్లల అభివృద్ధికి మొదటి ఆరేళ్ల వయసు చాలా కీలకం. దీనిని దృష్టిలో ఉంచుకుని, మానసిక నిపుణుల సూచనల మేరకు ఎన్ఈపీలో ఈ వయసు వారికి ప్రాధాన్యమిచ్చారు. 0–6 సంవత్సరాల వయసు గల పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలే వారి భవిష్యత్‌కు దిక్సూచిగా నిలువాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే బలమైన పునాదులు వేశారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో సైతం మౌలిక వసతులు పెంపొందించడంతో పాటు, ప్రతీ కేంద్రానికి ఆట వస్తువుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.



విశాఖ మాధవధార స్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ

జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ నెల 18 నుంచి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రీ ప్రైమరీ, 1, 2 తరగతులను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా వీరికి మెళకువలు నేర్పిస్తున్నారు. జిల్లాలోని 776 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో పాల్గొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక శిక్షణ గురువారంతో మొదటి దశ ముగిసింది. తిరిగి ఈ నెల 22 నుంచి 25 వరకు రెండో దశ శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల్లో బోధన నైపుణ్యతను పెంపొందించడమే లక్ష్యంగా సర్టిఫికెట్ కోర్సులో భాగంగా120 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు.

జ్ఞానజ్యోతి లక్ష్యమిదే..

ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్(పూర్వ ప్రాథమిక విద్య), పునాది అభ్యసన కొనసాగింపు కోసం రోడ్ మ్యాపు అభివృద్ధి చేయడం..

- అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు, 1–2 తరగతుల ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంపొందించడంలో భాగంగా వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడం..
- జిల్లాలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, వాటికి అనుసంధానంగా ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయడం..



పిల్లలకు ఆటపాటలతో ఏ విధంగా బోధించాలో నేర్చుకుంటున్న కార్యకర్తలు

పకడ్బందీగా శిక్షణ తరగతులు



జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లపై ఫోకస్ పెట్టాం. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ ప్రోగ్రాంలో భాగంగా ఇప్పటికే 1, 2వ తరగతులు బోధించే జిల్లాలోని 560 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. ఇప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ ద్వారా మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– డాక్టర్ జి.చంద్రశేఖరరావు, సమగ్ర శిక్ష ఏపీసీ, విశాఖ జిల్లా

బలీయంగా తొలి అడుగులు



పిల్లల చదువులకు తొలి అడుగులు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పడతాయి. అక్కడ నుంచే స్కూళ్లకు వస్తారు. అందుకనే ప్రీ ప్రైమరీ స్థాయిలోనే నైపుణ్యతతో కూడిన చదువులు అందించేందుకు ఇటువంటి శిక్షణ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. ఇందుకోసం ఐసీడీఎస్, విద్యా శాఖ సంయుక్తంగా శిక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నాం.

– దివాకర్, ఎంఈవో, గోపాలపట్నం మండలం